SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 215 | ఎడిటర్ : విక్రం కుమార్ | సోమవారం 14 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- గత పాలకులు సన్నబియ్యం సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు
- జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**సమయం న్యూస్, మధిర పట్టణం:** సంక్షేమంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 'పెద్ద సంఖ్యలో ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాలూ మనవైపు చూస్తుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణం' అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''గత పాలకులు పదేళ్లపాటు సన్న బియ్యం **తరువాయి 2లో**





## వైకాపా బాధిత దళిత కుటుంబాలను ఆదుకుంటాం

- వాళ్లు ధ్వంసం చేసిన ఇళ్లకు మరమ్మతులు చేయిస్తాం
- స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇస్తాం
- పల్నాడులో పిన్నెల్లి బాధితులకు చంద్రబాబు భరోసా
- ప్రాణభయంతో పుట్టిపెరిగిన ఊళ్లకు దూరంగా బతికామని దళితుల ఆవేదన

**సమయం న్యూస్, అమరావతి:** గత ప్రభుత్వంలో వైకాపా వాళ్ల అరాచకాలు, దౌర్జన్యాలకు గురైన ప్రతి బాధిత కుటుంబాన్నీ అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం **తరువాయి 2లో**

## ప్రజల భూములకు.. భూభారతితో భరోసా

- నూతన చట్టానికి నేడు శ్రీకారం
- జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదుల స్వీకరణ
- ధరణితో కొల్లగొట్టిన భూములపై ఆడిట్.. త్వరలో వివరాల వెల్లడి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పోర్టల్‌ను నేడు ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడి

**సమయం న్యూస్, హైదరాబాద్:** గత ప్రభుత్వం మాదిరి హడావిడిగా, తప్పులతో కాకుండా ఎంతో శ్రమించి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని.. ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి ఇకపై ఉండదని.. నూతన రెవెన్యూ చట్టం భూభారతి 2025 సోమవారం నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి సమస్యల్ని పరిష్కరిస్తామని.. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఆయన **తరువాయి 2లో**



## పంటలను ముంచిన వడగళ్లు

- జనగామ, సిద్దిపేట నల్గొండ, యాదాద్రి, ఖమ్మం జిల్లాల్లో వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- నెలాఖరు వరకు అకాల వర్షా లు!

**సమయం న్యూస్, హైదరాబాద్::** రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్ల వానలు హడలెత్తిస్తున్నాయి. ఆదివారం కురిసిన వర్షాలతో జనగామ, **తరువాయి 2లో**





## నేటి నుంచి ఎస్సీ వర్గీకరణ అమలు

- ఉత్తర్వులు, విధివిధానాలు జారీ చేయనున్న ప్రభుత్వం
- జీవో తొలి కాపీని సీఎం రేవంత్‌కు ఇవ్వనున్న ఉపసంఘం
- 59 ఉపకులాలు మూడు గ్రూపులుగా వర్గీకరణ

**2లో**

## మంగళగిరికి ఉజ్వల భవిష్యత్తు

- పరిశ్రమలు తెచ్చి.. ఉద్యోగాలు కల్పిస్తాం
- 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో మంత్రి లోకేశ్
- తొలి విడతలో 3,005 పేద కుటుంబాలకు పట్టాల పంపిణీ

**2లో**



## ఉక్రెయిన్‌పై ఉరిమిన రష్యా

- పండగవేళ సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణులు
- 34 మంది మృతి.. 117 మందికి గాయాలు

**2లో**





## ఉద్రిక్తంగానే... ముర్షిదాబాద్...

- మరో 12 మంది అరెస్టు

కోల్‌కతా: వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న ఆందోళనలతో పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా ఉద్రిక్తంగానే ఉంది. కొత్తగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకపోయినా పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. తాజాగా మరో 12 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు **తరువాయి 2లో**

## బాణసంచా తయారీ కేంద్రంలో.. 'పెను విస్ఫోటం'

- ఘటనా స్థలంలోనే ఐదుగురి దుర్మరణం
- ఆసుపత్రిలో మరో ముగ్గురి మృత్యువాత
- 300 మీటర్ల మేర ఎగిరిపడిన శిథిలాలు, శరీర భాగాలు
- కేజీహెచ్‌లో ఐదుగురు, నర్సీపట్నంలో ముగ్గురికి చికిత్స
- సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం ప్రకటన.. ప్రధాని రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

**2లో**



# ప్రజల భూములకు.. భూభారతితో భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. భూభారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. ఆదివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''గత భారాస ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణి పోర్టల్ మాదిరిగా ఇది మూడు, నాలుగేళ్లకు పరిమితం కాదు. భవిష్యత్తులో ఏ సీఎం వచ్చినా అమలు చేసేలా పారదర్శకంగా రూపొందించాం. భూభారతిని రెఫరెండంగా తీసుకుని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తాం. గత ప్రభుత్వ హయాంలో ధరణితో కొల్లగొట్టిన భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. ఆ వివరాల్ని త్వరలోనే ప్రజలకు వెల్లడిస్తాం. భూభారతిపై ఎవరైనా ఫేక్ ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కొందరు కావాలనే ఆటంకాలు కల్పించే ప్రయత్నాలు చేయొచ్చు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు.

*** భూముల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..**

రాష్ట్రంలో రైతుల భూముల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే. ఎవరూ ఆందోళన చెందొద్దు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి, అందరికీ ఆమోదయోగ్యమైన భూభారతి చట్టాన్ని తీసుకొస్తున్నాం. ఇందులో రెవెన్యూ మంత్రిగా భాగస్వామిని అయినందుకు నా జన్మ ధన్యమైంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మూడు మండలాల్లో భూములపై ప్రజల నుంచి మాన్యువల్‌గా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తాం. జూన్ 2కల్లా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. పైలట్ మండలాలకు నేను వెళ్తా. ఇతర మంత్రులూ పర్యటిస్తారు. నాడు ధరణి వచ్చాక 100 రోజులకుపైగా వెబ్‌సైట్ పనిచేయలేదు. భూభారతి పోర్టల్ ప్రారంభంతో భూముల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. మంగళవారం నుంచి యథాతథంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. గత ప్రభుత్వం 2020 చట్టంలో సాదాబైనామా అంశాన్ని చేర్చకపోవడంతో సమస్య వచ్చింది. దాదాపు 6.5 లక్షల సాదాబైనామా దరఖాస్తుల్ని అప్పట్లో తిరస్కరించారు. ఆ తర్వాత వచ్చినవి కలిపి 9.5 లక్షల దరఖాస్తులున్నాయి. వీటిలో అర్హమైనవాటిని భూభారతి చట్టం కింద పరిష్కరిస్తాం.

*** 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తాం**

భూముల సర్వేకు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేశాం. ప్రభుత్వ సర్వేయర్ల సంఖ్య ఇక్కడ పరిమితంగా ఉంది. కర్ణాటకలో 17 వేల మంది ప్రైవేటు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించారు. తెలంగాణలో తొలి దశలో ఐదారు వేల మందిని నియమించుకుంటాం. వారికి 90 రోజులపాటు జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి.. లైసెన్సులు ఇస్తాం. వారికి విద్యార్హతగా ఇంటర్ లేదా డిగ్రీని నిర్ణయించే అవకాశం ఉంది. భూభారతి అమల్లోకి వచ్చాక.. తమ భూముల వివరాల కోసం అభద్రతతో ఒకేసారి కోటి మంది లాగిన్ అయితే సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అయినా, ఎవరూ ఆందోళన చెందొద్దు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోర్టల్‌కు కొత్త అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా పోర్టల్ అభివృద్ధి సాగుతుంది.

*** భూసమస్యల పరిష్కారానికి ట్రైబ్యునళ్లు**

గత ప్రభుత్వం వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థలను రద్దు చేసినా అవినీతి తగ్గలేదు. వీఆర్వో వ్యవస్థను మళ్లీ తీసుకొచ్చి అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తాం. మే నెల మొదటి వారంలో గ్రామ రెవెన్యూ పాలనా అధికారుల వ్యవస్థను అమలులోకి తెస్తాం. ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభించాం. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు సుమారు ఐదు స్థాయుల్లో భూసమస్యల పరిష్కారానికి అధికారాలను వికేంద్రీకరించాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి జిల్లాలవారీగా లేదా కొన్ని జిల్లాలు కలిపి ఏర్పాటు కావొచ్చు. సమస్యలు తగ్గితే ట్రైబ్యునళ్లను కుదిస్తాం. ధరణిలో గతంలో ఉన్న 33 మాడ్యూళ్లను ఆరుకు కుదించాం. దీంతో అందరికీ పోర్టల్ సులభతరంగా ఉంటుంది. పైలట్ మండలాల్లో ప్రతి గ్రామానికి తహసీల్దార్ వెళ్తారు. ప్రతి మండలానికి అదనపు కలెక్టర్ స్థాయి అధికారి వెళ్తారు. ధరణిలో తప్పుల్ని సవరించగలిగాం కానీ మొత్తం పోర్టల్‌ను తొలగించలేకపోయాం. దానికి అప్‌గ్రేడ్ వెర్షన్‌ని అభివృద్ధి చేస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో టెండర్లు పిలుస్తాం. కొద్ది నెలల్లో తాజా వెర్షన్‌తో మరో సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తాం. అది 50 నుంచి 75 ఏళ్ల వరకు ఉంటుంది' అని పొంగులేటి పేర్కొన్నారు.

*** సామాన్యులకూ అర్థమయ్యేలా పోర్టల్**

**- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్: సామాన్య రైతులు సైతం సులభంగా అర్థం చేసుకునేలా భూభారతి పోర్టల్ ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పోర్టల్‌లోని సమాచారం విషయంలో భద్రతాపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో భూభారతిపై ఆదివారం అధికారులతో సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో మూడు మండలాల్లో భూభారతిని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం సమీక్షించిన ముఖ్యమంత్రి ఆదివారం మరోసారి అధికారులతో సమావేశమయ్యారు. భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలని సూచించారు. పోర్టల్ అత్యాధునికంగా ఉండాలని ఆయన అన్నారు. ఇది కనీసం వందేళ్లపాటు అమలులో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ పాల్గొన్నారు.

## సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

సన్నాయి సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు. రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం 90 లక్షల కార్డుల ద్వారా 2.85 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. కొత్తగా వచ్చేవాటితో కలిపి మొత్తం కోటి కార్డుల ద్వారా 3.10 కోట్ల మంది లబ్ధి పొందుతారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, అంకితభావానికి ఈ పథకం నిదర్శనం. నిరుద్యోగుల కోసం రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట నూతన స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టాం. మూడు నుంచి వారం రోజులపాటు శిక్షణ ఇచ్చి ఈ పథకాల గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తాం. గత పాలకులు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి అప్పగించారు. వాటన్నింటినీ సరిచేసుకుంటూ, ప్రజలకు సంక్షేమం అందించడంలో ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. రైతు రుణమాఫీ కోసం రూ.21 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌కు రూ.2,675 కోట్లు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఏడాదిలో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేశాం. మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేశాం'' అని భట్టి వివరించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## పంటలను ముంచిన వడగళ్లు



సిద్దిపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పది వేలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వడగళ్ల వానలతో పలు గ్రామాల్లో మామిడికాయలు, ధాన్యం గింజలు రాలిపోయాయి. పలుచోట్ల వ్యవసాయ మార్కెట్లకు రైతులు తెచ్చిన ధాన్యం వాననీటికి కొట్టుకుపోయింది. జనగామలోని ఆర్టీసీ డిపో ఆవరణలో భారీ వృక్షం కూలిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని చామాపూర్‌లో విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. ఖమ్మం దేవరాపల్లి పాత జాతీయ రహదారిపై ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లిసీతారాంపురం సమీపంలో చెట్లు పడిపోవటంతో రెండువైపులా 4 కి.మీ. మేర రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి.

**21 రోజుల్లో.. 50 వేల ఎకరాల్లో పంట నష్టం**

రాష్ట్రంలో మార్చి నాలుగో వారం నుంచి ఇప్పటివరకు అకాల వర్షాలతో 50 వేలకు పైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ నివేదించింది. 8 వేల ఎకరాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మార్చి నెలాఖరు నుంచి ఈ నెల 2 వరకు కురిసిన వర్షాలతో 8,408 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ నివేదించగా.. ఎకరానికి రూ.10 వేల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 3వ తేదీ నుంచి 8 వరకు మరో 14,956 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు నివేదిక అందగా... దానిపై రైతువారీ సర్వే వివరాలు వచ్చాక ఈ నెల 20న పరిహారం ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 10 నుంచి ఆదివారం వరకు మరో 26 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తాజా నివేదిక వెల్లడించింది. దీనిపై ఈ నెల 25న పరిహారం ప్రకటించే వీలుంది. ఈ నెలాఖరు వరకు వానలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో రైతులు వరి కోతలను వాయిదా వేస్తున్నారు.

**రాష్ట్రంలో మూడు రోజులపాటు వర్షా లు**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. సోమవారం ఖమ్మం, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగామ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతాయని పేర్కొంది. మంగళ, బుధవారాల్లో భద్రాద్రి, ఖమ్మం, ములుగు, జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది. ఆదివారం జనగామ, సూర్యాపేట, యాదాద్రి, భద్రాద్రి, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో వడగళ్లతో భారీ వర్షాలు పడ్డాయని తెలిపింది.

## నేటి నుంచి ఎస్సీ వర్గీకరణ అమలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సోమవారం నుంచి అమలు కానుంది. దాదాపు 30ఏళ్లపాటు వర్గీకరణ కోసం జరిగిన పోరాటానికి ప్రతిఫలంగా దీన్ని అమల్లోకి తీసుకువస్తూ ఉత్తర్వులు, నిబంధనలు జారీకానున్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజును వర్గీకరణ అమలు తేదీగా పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది. ఉత్తర్వుల తొలికాపీని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయాలని ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తుది సమావేశంలో నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్‌అక్తర్ ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఎస్సీ సంక్షేమ శాఖ డైరెక్టర్ క్షితిజ, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

**2026 జనాభా లెక్కల తరువాత...**

రాష్ట్రంలో 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచే విషయాన్ని పరిశీలిస్తాం. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. తెలంగాణలో ఎస్సీ జనాభా 17.5 శాతానికి పెరిగింది. జనాభా లెక్కలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్ ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును ఇప్పటికే ప్రభుత్వం తిరస్కరించింది'' అని ఉత్తమ్ తెలిపారు.

## వైకాపా బాధిత దళిత కుటుంబాలను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వైకాపా నేతలు ధ్వంసం చేసిన ఇళ్లకు మరమ్మతులు చేయిస్తామని, ఇల్లు లేని వారికి స్థలం కేటాయించి గృహాన్ని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబమూ ఆర్థికంగా స్థిరపడే మార్గం చూపిస్తామని భరోసా ఇచ్చారు. జగన్ పాలనలో అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతో వైకాపా నేతల వేధింపులు, దాష్టీకాలకు గురైన పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం ఆత్మకూరు గ్రామానికి చెందిన పలువురు దళితులు.. ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం రాత్రి కలిశారు. గత ఐదేళ్లలో వారు ఎదుర్కొన్న ఇబ్బందుల్ని ఆయనకు వివరించారు. ఆత్మకూరులో తెదేపా సానుభూతిపరులనే కారణంతో 127 ఎస్సీ కుటుంబాల్ని వైకాపా నేతలు, కార్యకర్తలు దారుణంగా వేధించారని, కొందరిని గ్రామ బహిష్కరణ చేశారని వాపోయారు. వారి అరాచకాల్ని తట్టుకోలేక ప్రాణభయంతో తాము పుట్టిన గ్రామాన్ని వదిలి వేరే ప్రాంతాల్లో తలదాచుకున్నట్టు తెలిపారు. ''అయినా వైకాపా వాళ్ల కడుపు మంట చల్లారలేదు. మా ఇళ్లను ధ్వంసం చేశారు. మా పొలాల్ని ఆక్రమించుకొన్నారు. కొంతమంది చేలు బీడుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ధైర్యంగా స్వగ్రామానికి వచ్చాం'' అని చంద్రబాబుకు వారు వివరించారు.

**మీ పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తా...**

వారి ఆవేదనను విన్న చంద్రబాబు...త్వరలోనే ఆత్మకూరు గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకొని.. అండగా నిలుస్తామన్నారు. ''పాడి, పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసి మీకు శాశ్వత జీవనోపాధి కల్పిస్తాం. చదువుకున్న యువతకు నైపుణ్యశిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటా'' అని చంద్రబాబు ధైర్యం చెప్పారు. వర్గీకరణ గురించి వారి అభిప్రాయాలు కోరగా... ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

## మంగళగిరికి ఉజ్వల భవిష్యత్తు

తాడేపల్లి, మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, పరిశ్రమలు తెచ్చి ఇక్కడి యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మంత్రి లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం 'మన ఇల్లుమన లోకేశ్' కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా 832 పేద కుటుంబాలకు శాశ్వత హక్కు కల్పిస్తూ మంత్రి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. తొలి విడతలో భాగంగా మొత్తం ఇప్పటి వరకు ఆయన 3,005 కుటుంబాలకు నూతన వస్త్రాలు పెట్టి...పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

**పేదలకు షరతులు పెట్టొదన్నారు..**

ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లపై శాశ్వత హక్కు కల్పిస్తూ జీవో నంబరు 30 తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ చొరవే కారణమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పట్టా తీసుకున్నాక నాలుగేళ్ల తరువాత అమ్ముకునే హక్కుతోపాటు రిజిస్ట్రేషన్‌కు కొంత నగదు చెల్లించాలని తాము ప్రతిపాదించామన్నారు. పేదలకు ఎలాంటి షరతులు వద్దని.. పట్టా తీసుకున్న రెండేళ్లకే వారు విక్రయించుకునే సౌలభ్యం కల్పించాలని మంత్రి లోకేశ్ కోరారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టాలు ఇచ్చి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని చెప్పారు.

**సానుభూతి కోసమే నాటకాలు..**

మంత్రి అనగాని మాట్లాడుతూ.. 'ప్రతిపక్ష హోదాలేని ప్రతిపక్ష పార్టీ నాయకుడు ఒకరున్నారు. ఎక్కడికి వెళ్లినా తనకు భద్రత తగ్గిందని అంటారు. 58 మందితో భద్రత ఆయనకు తప్ప ఎవరికి ఉంది' అని ప్రశ్నించారు. సానుభూతి కోసం ఆయన నాటకాలు ఆడుతున్నారన్నారు. గతంలో జగన్ సభా ప్రాంగణాల వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను అవహేళన చేస్తూ ఫ్లెక్సీలు పెట్టేవారని.. సమాజానికి నేర్పించే విషయాలు ఇవేనా అని నిలదీశారు. శాసనసభలో భువనేశ్వరిని అవమానిస్తే వైకాపా నాయకులు హేళనగా నవ్వారన్నారు. ప్రతిపక్ష హోదాలేని పార్టీ నాయకుడి శ్రీమతి అయినప్పటికీ తమ సోదరిగా, వారి పిల్లలను మేనకోడళ్లుగా భావిస్తున్నామని, అందుకే ఆమెను అవమానించిన సొంత పార్టీ వ్యక్తిపైనే చర్యలు తీసుకున్నామన్నారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో.. 'పెను విస్ఫోటం'



విశాఖపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట: చుట్టూరా పచ్చటి పొలాలు. పక్కనే గెడ్డ వాగు జల సవ్వళ్లు. ఆహ్లాదంతో కట్టిపడేసే ఆ ప్రాంతం.. ఒక్కసారిగా భీతావహమైంది. భారీ పేలుళ్లతో అక్కడి నేల కంపించిపోయింది. ఏమైందో తెలుసుకునేలోగా భారీ ప్రాణనష్టం సంభవించింది. ఎగసిపడే మంటల్లో, ధ్వంసమైన రేకుల షెడ్ల శిథిలాల కింద ఐదుగురి మృతదేహాలు ఛిద్రమై పడి ఉన్నాయి. కొందరి శరీరాలు కాలిపోయాయి. కొందరి కాళ్లు, మొండెం, తల వేరుపడి చెల్లాచెదురుగా పడిపోయాయి. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారులోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం భారీ పేలుడు ధాటికి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలిలోనే ఐదుగురు చనిపోగా, కొన ఊపిరితో ఆసుపత్రిలో చేరిన వారిలో ముగ్గురు మృతిచెందారు. మరో 8 మంది తీవ్రగాయాలతో

## ఉద్రిక్తంగానే ముర్షిదాబాద్

కోల్‌కతా: వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న ఆందోళనలతో పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా ఉద్రిక్తంగానే ఉంది. కొత్తగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకపోయినా పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. తాజాగా మరో 12 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల నుంచి ప్రజలు పడవల్లో భగీరథి నది దాటి, పొరుగున ఉన్న మాల్దాకు వలసబాట పట్టారు. ఇంతవరకు 400 మంది వలసవెళ్లారని బెంగాల్ శాసనసభ విపక్ష నేత సువేందు అధికారి తెలిపారు. తృణమూల్ సర్కారు అనుసరిస్తున్న బుజ్జగింపుల ధోరణితో మతపరమైన అణచివేత పెరిగిపోయి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సి వస్తోందని ఆరోపించారు. పరిస్థితిని భద్రత బలగాలు క్షుణ్నంగా సమీక్షిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు, ఇంటర్నెట్ సేవల నిలిపివేత కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ముర్షిదాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పలు దుకాణాలు, హోటళ్లు, ఇళ్లు, వాహనాలు కాలిపోయి కనిపిస్తున్నాయి. బయటి నుంచి వచ్చిన మూకల సభ్యులు తమ ఇళ్లకు నిప్పుపెట్టడంతోపాటు పురుషుల్ని కొట్టి, మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ఉక్రెయిన్‌పై ఉరిమిన రష్యా

కీవ్: యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ.. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడుతోంది. ఆదివారం సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో 34 మంది మృతి చెందారు. 117 మంది క్షతగాత్రులయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. స్థానిక కాలమానం ప్రకారం 10.15 గంటలకు రష్యాకు చెందిన రెండు బాలిస్టిక్ క్షిపణులు సుమీ నగరాన్ని తాకాయి. క్రైస్తవులు పర్వదినంగా జరుపుకొనే 'పామ్ సండే' రోజునే ఈ దాడి జరగడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా మండిపడ్డారు. యుద్ధం ముగించాలని రష్యాకు ఏ కోశానా లేదని విమర్శించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



# రామన్న రాకతో గులాబీ మయమైన మల్కాజ్ గిరి

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 14 , సమయం న్యూస్ : ఉప్పొంగిన అభిమానం - ఉత్సాహంలో గులాబీ శ్రేణులు అడుగడుగునా ఆప్యాయత, ప్రేమానురాగాలతో స్వాగతం పలికిన యువత, మహిళలు, వృద్ధులు.**

























## లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణ చెక్కుల పంపిణీ

**బాన్సువాడ ఎప్రిల్ 13( సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని నసురుల్లాబాద్ మండలానికి చెందిన డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణ బిల్లు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి.

* అదేవిధంగా నసురుల్లాబాద్ మండలానికి చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన పోచారం గారు.
* బాన్సువాడ పట్టణంలోని తన నివాసం వద్ద నస్రుల్లాబాద్ మండల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన పోచారం.
* నసురుల్లాబాద్ మండల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు ఈ పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు.



### సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బానుకా నర్మదా మల్లికార్జున్‌ను కలిసిన

## వంజరి బిజినెస్ అసోసియేషన్ సభ్యులు

అంబర్ పేట, ఏప్రిల్ 13, సమయం న్యూస్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన సభ్యురాలు బానుకా నర్మదా మల్లికార్జున్ ను వంజరి బిజినెస్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కంటోన్మెంట్ బోర్డు సభ్యులుగ ఎన్నికైన సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా వంజరి బిజినెస్ అసో సియేషన్ సభ్యులు బానుకా నర్మదా మల్లికార్జున్‌ను శాలువాతో సత్కరించారు. తమ అసోషియేషన్ తరపున ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వంజరి బిజినెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎదగని రాజ్ కుమార్, సామల బాలక్రిష్ణ , మహదేవ్ ముండె, విట్టల్ షరన్, ఎమికే శ్రినివాస్, ఆముద శివరాజన్ , క్యాదారి అజయ్ ఆనంద్ తో పాటు పలువురు



అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బానుకా నర్మదా మల్లికార్జున్ మాట్లాడుతూ, వంజరి బిజినెస్ అసోసియేషన్ సభ్యులు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎదగని రాజ్ కుమార్ మాట్లాడుతూ, బానుకా నర్మదా మల్లికార్జున్ ఎంపికకావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్..

*** ప్రతి హృదయంలో ప్రత్యేక స్థానం..**

*** రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర.. * నేడు అంబేద్కర్ జయంతి..**

అణగారిన వర్గాల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహానీయుడు. జ్ఞాన సాధనలో అసాధారణ పాండిత్యం సాధించిన తత్వవేత్త.. సమానత్వం, స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన దార్శనికుడు.. భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గొప్ప న్యాయవేత్త.. సమాజంలో న్యాయం కోసం దీర్ఘకాలిక దృష్టితో పని చేసిన విజనరీ.. అస్పృశ్యత, కులవివక్షతను ఎదురించి నిర్భయంగా పోరాడిన యోధుడు.. సామాజిక సంస్కరణలకు, అణగారిన వర్గాల ఉద్ధరణకు నిరంతరం కృషి చేసిన నిష్టాపరుడు.. వ్యక్తిగత జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన మహాత్ముడు..అన్నివర్గాల ప్రజలకు తగిన గౌరవం దక్కేలా జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకుడు.. నమ్మిన సిద్ధాంతం కోసం నిజాయితీగా వ్యవహరించిన ధీరుడు.. అడ్డంకులు, విమర్శలను సహనంతో నిజాయితీగా ఎదుర్కొని ముందుకు సాగిన స్థితప్రజ్ఞుడు.. ఆయనే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్. ఈ రోజు ఆయన 134వ జయంతి. 1891లో ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అంబవాడేలో తల్లిదండ్రులు రాంజీ మలోజీ సాక్వాల్, భీమాబాయ్‌లకు జన్మించారు. పూర్తి పేరు భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్. చదువుకోవాలన్నా...మంచినీరు తాగాలన్నా కులమే అడ్డుగా నిలిచింది. అనేక అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. అందు కోసమే తాను పడ్డ బాధలు ఎవరికీ రావద్దనే సమాజంలో వర్ణ, వర్గభేదాలు ఉండొద్దనే రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. ఎందరికో ఆరాధ్యుడయ్యారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివారు. రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు కావాల్సిన అవసరాలను, హక్కులను తెలిపిన గొప్ప మహా నాయకుడు. ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులు కల్పించిన దార్శనికుడు అంబేద్కర్. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎవరెవరికీ ఎంత రిజర్వేషన్ల ప్రకారం వేతనాలు తీసుకోవాలో, సమాజంలో ఎలా నడుచుకోవాలో, రాజ్యాంగంలో క్లుప్తంగా రచించి ప్రజలకు అందించిన గొప్ప నేత. అంబేద్కర్ విభిన్న అంశాలపై ఎంతో విస్తృతంగా రచనలు చేశారు. 'ప్రజాస్వామ్యం' 'అంటరానితనం' 'కుల నిర్మూలన' 'మతమార్పిడి' 'బౌద్ధమతం' 'హిందూమతంలోని చిక్కుముడులు' 'ఆర్థిక సంస్కరణలుదళితులు' 'భారతదేశ చరిత్ర' మొదలైన వాటిపై ఆయన రచనలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయి. అంబేద్కర్ భారతీయ సామాజిక వ్యవస్థను మార్చేందుకు జీవితాంతం కృషి చేశారు. కుల వ్యవస్థను రద్దు చేయడానికి కులనిర్మూలనను ప్రతిపాదించారు. కులం ఒక పెట్టుబడిగా, అదనపు సంపదగా, అదనపు విలువగా, అధికార కేంద్రంగా ఉందని స్పష్టం చేయడం ద్వారా అంబేద్కర్ కులాన్ని కూడా అర్థశాస్త్రంలో భాగంగా చర్చించారు. తెలుగునాట మొదటిసారిగా అంబేద్కర్‌ను సాహిత్యంలో ప్రస్తావించిన ఘనత మహాకవి గుర్రం జాషువాకే దక్కింది.

**బాబాసాహెబ్ ప్రత్యేకతలు..**

బాబాసాహెబ్ తన జీవిత కాలంలో 527 ప్రసంగాలు చేశారు. ప్రతి ప్రసంగం ప్రజలను అత్యంత ప్రభావితం చేశాయి. లండన్ యూనివర్సిటీ లైబ్రరీలో ఉన్న పుస్తకాలు మొత్తం చదివిన ఒకే ఒక్కరూ బాబాసాహెబ్. ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావశీలురైన ఆరుగురు మేధావుల్లో బాబాసాహెబ్ ఒకరు. లండన్ విశ్వవిద్యాలయంలో తన ఎనిమిదేళ్ళ పీహెచ్డీని మూడు సంవత్సరాల్లో పూర్తి చేసిన అత్యంత మేధావి.

**అంబేద్కర్ విద్యాభ్యాసం..**

బీ.ఏ (బాంబే విశ్వవిద్యాలయం, 1912), ఎం.ఎ. (కొలంబియా విశ్వవిద్యాలయం, 1915), ఎమ్మెస్సీ ( లండన్ స్కూల్ ఆఫ్ ఏకనామిక్స్, 1921), పీహెచ్‌డీ (కొలంబియా విశ్వవిద్యాలయం, 1927), డీఎస్సీ (లండన్ విశ్వవిద్యాలయం, 1923), బారిష్టర్ ఎట్ లా (గ్రేస్ ఇన్ లండన్, 1923)

ఎల్ఎల్‌డీ(కొలంబియా విశ్వవిద్యాలయం, 1952, గౌరవపట్టా), డీ.లిట్ ( ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1953, గౌరవపట్టా)

**కుటుంబ నేపథ్యం..**

మరాఠీ నేపథ్యం కల అంబేద్కర్ కుటుంబం మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలో అంటవాడ గ్రామంలో నివాసం ఉండేది. వీరి వంశీకులు మెహర్ కులానికి చెందినవారు. తండ్రి రాంజీ బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సుబేదారు. మొత్తం 13 మంది తోబుట్టువుల్లో తొమ్మిది మంది అకాల మృత్యువాత పడ్డారు. మిగిలినవారు.. ఇద్దరు అక్కలు మంజుల, తులసీ, ఇద్దరు అన్నలు బలరాం, ఆనందరావు మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించడం వల్ల చిన్నతంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్న అంబేద్కర్... పాఠశాలలో ఆయనను వేరే పిల్లలతో కలవకుండా, మాట్లాడకుండా పాఠశాల గదిలో ఒక మూల కూర్చోబెట్టేవారు. నీళ్లు తాగాలంటే ప్యూన్ మాత్రమే వచ్చి ఇచ్చే పరిస్థితి. అక్కడ హేళనలు, అవమానాలపై తిరగబడ్డారు.. ఈ వివక్షలన్నింటినీ ఎదుర్కొంటూ మెట్రిక్యులేషన్ అత్యధిక మార్కులతో పాసయ్యారు. బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఎ. పూర్తి చేశారు. విదేశాల్లో చదువు పూర్తి చేసిన తర్వాత బరోడా సంస్థానంలో పదేళ్లు పని చేసే షరతుపై 1913లో రాజా గారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరిన అంబేద్కర్. 1915లో ఎం.ఎ., 1916లో పి.హెచ్.డి. డిగ్రీలను పొందిన అంబేద్కర్... 1917లో స్వదేశం వచ్చాక మహారాజా శాయాజీరావ్ సంస్థానంలో మిలిటరీ కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఇక అంబేద్కర్ దళిత సమస్యల పరిష్కారానికి ఆలిండియా డిప్రెస్స్‌డ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా దళితులను సమీకరించే ప్రయత్నం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. రాజ్యాంగ రచన బాధ్యతలను అప్పగించిన నెహ్రూ.. ప్రభుత్వం భారత రాజ్యాంగ పరిషత్ నియమించిన రాజ్యాంగ సంఘానికి అంబేద్కర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనేక దేశాల రాజ్యాంగాన్ని ఆధ్యయనం చేసి దృఢమైన రాజ్యాంగాన్ని తయారు చేయడంలో కీలకంగా వ్యవహరించారు. తరతరాలుగా బడుగు, బలహీనవర్గాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా వారి అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్. వ్యవసాయాభివృద్ధి దేశానికి ఊతమిస్తాయని బలంగా నమ్మిన అంబేద్కర్.. వారసత్వ, వివాహ చట్టాల్లో లింగ సమానత్వాన్ని వివరించడానికి ప్రయత్నించారు. హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను పార్లమెంటులో నిలిపివేయడంతో.. 1951లో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత అంబేద్కర్ తన జీవితంలోని ముఖ్యాంశాలను తన ఆత్మకథ 'వెయిటింగ్ ఫర్ ఏ వీసా'లో రాసుకున్నారు. మధుమేహం వ్యాధితో బాధపడుతూ 1954లో డిసెంబర్ 6న తన ఇంట్లోనే కన్నుమూశారు అంబేద్కర్. దళితుల హక్కులు, అభ్యున్నతి కోసం జీవితకాలం పోరాటం చేసిన యోధుడిగా గుర్తింపు పొందారు. 1990 లో అత్యున్నత భారత రత్న పురస్కారంతో భారత ప్రభుత్వం గౌరవించింది. అంబేద్కర్ పేరు వింటేనే అదో ధైర్యం. దళితులు, గిరిజనులు, మైనారిటీలకు ఆయనొక ఆశాజ్యోతి. బడిలో.. గుడిలో.. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా తట్టుకొని నిలబడ్డారు. ఈ సమాజంలో రుగ్మతలపై చివరి శ్వాస వరకు పోరాడారు. సమ సమాజాన్ని స్థాపించాలని స్వప్నించారు. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం.. ప్రతి హృదయంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది.



గొట్టిముక్కుల బ్రహ్మాచారి
సీనియర్ జర్నలిస్ట్, ఫోన్ : 9441884389

# ఆర్‌టిసి బస్సు కిందపడి యువకుడి మృతి

**కుత్బుల్లాపూర్, సమయం న్యూస్, ఏప్రిల్ 14 :** ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునే క్రమంలో ఆర్‌టిసి బస్సు కింద యువకుడు పడి మృతిచెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐడిపిఎల్ వద్ద చోటుచేసుకుంది. యువకుడు మృతిచెందడంతో అతడి బంధువులు, వాహనదారులు ఆందోళన చేయడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో బాలానగర్ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం, గేదలంక గ్రామానికి చెందిన జోష్‌బాబు (35) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి కుత్బుల్లాపూర్, షాపూర్, రొడామెస్త్రీ నగర్‌లో ఉంటూ కార్పెంటర్ పనిచేస్తున్నాడు. తన సోదరుడు ఫణికుమార్ పంజాగుట్టకు రమ్మని చెప్పడంతో బైక్‌పై ఇంటి నుంచి సోదరుడి వద్దకు బయలు దేరాడు. బాధితుడు బైక్ వస్తుండగా ఐడిపిఎల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఛాలాన్లు తనిఖీ చేస్తున్నారు. జోష్‌బాబు వారి వద్దకు రాగానే ట్రాఫిక్ కానిస్టేబుల్ గోపాల్ షర్ట్ కాలర్ పట్టుకుని గుంజడంతో ఒక్కసారిగా అదుపు తప్పి కిందపడిపోయాడు. అదే సమయంతో ఆర్‌టిసి బస్సు జోష్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జోష్‌బాబు బంధువులు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లే వ్యక్తి మృతిచెందాడని ఆందోళనకు దిగారు. దీంతో ప్రమాదానికి కారణమైన ట్రాఫిక్ కానిస్టేబుల్ అక్కడి నుంచి పరారయ్యాడు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని ఆరో పిస్తూ వాహనదారులు, బాధిత కుటుంబ సభ్యులు రహదారిపైనే ఆందోళనకు దిగారు. దీంతో నర్సాపూర్ వెళ్లే రహదారిలో జీడిమెట్ల నుంచి బాలానగర్ వరకు వాహనాలు నిలి చిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించగా వారితో వాగ్వాదానికి దిగారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన వారిని



చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. దీంతో బాలానగర్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది, పోలీసు బలగాలను అక్కడ భారీగా మోహరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

**ప్రశ్నిస్తే...లాఠీఛార్జ్ చేశారు..**

పోలీసుల నిర్లక్షం వల్ల ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడని ప్రశ్నిస్తే తమపై లాఠీఛార్జ్ చేశారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ వాహనాలను ఆపి తనిఖీ చేయాలని, కాలర్ పట్టడం ఏంటని ప్రశ్నించారు. వాహనం ఆపకుండా వెళ్తే చలానా విధించి ఇంటికి పంపించాలని తెలిపారు. పోలీసులు నిర్లక్షం వల్ల ఓ నిండు ప్రాణం పోయిందని, అతడి కుటుంబ సభ్యులు రోడ్డు మీదకు వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కానిస్టేబుల్‌కు బ్రీత్ టెస్ట్....**

తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎ.గోపాల్ మద్యం మత్తులో ఉన్నాడని వాహనదారులు ఆరోపించడంతో పరీక్షల కోసం ఆస్పత్రికి పంపించారు. బ్లడ్ టెస్ట్ చేసి రిపోర్టు సబ్‌మిట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఇన్‌స్పెక్టర్ గోపాల్‌ను పరీక్షల కోసం ఆస్పత్రికి పంపించారు. రిపోర్టు వచ్చిన తర్వాత కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.



# పాత నగరం మెట్రో కారిడార్ లో జోరుగా స్థల సేకరణ

*** ఉత్సాహంగా ముందుకు వస్తున్న భూ యజమానులు**

*** 205 ప్రభావిత ఆస్తులకు ఇప్పటికే రు. 212 కోట్లకు చెక్కుల పంపిణీ చేసామన్న మెట్రో ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి.**



మెట్రో రైల్ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుండి చంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో విస్తరణ పనులు ఇప్పుడు జోరుగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుని, కూల్చి వేసే కార్యక్రమం స్థానికుల పూర్తి సహాయ సహకారాలతో ముమ్మరంగా సాగుతోందని ఆయన చెప్పారు. మొత్తం ఈ మార్గంలో 1100 ప్రభావిత ఆస్తుల ఉండగా ఇప్పటి వరకు ఈ మార్గంలో 205 ఆస్తులకు చెక్కుల పంపిణీ జరిగిందని, ఆయా ఆస్తులకు సంబంధించిన రు. 212 కోట్ల నష్టపరిహారం ఇప్పటికే చెల్లించడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కు ముడులుగా ఉన్న కొన్ని క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్ కేబుళ్లను అత్యంత అప్రమత్తంగా తొలగించి తమ ఇంజినీరింగ్ సిబ్బంది మార్గాన్ని సుగమం చేసారని మెట్రో ఎండీ వెల్లడించారు. మెట్రో అధికారులతో పాటు, రెవిన్యూ, పోలీస్ పర్యవేక్షణలో మెట్రో మార్గం విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రభావిత ఆస్తుల యజమానులు స్వచ్ఛందంగా స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్ని ఆమోదించి ముందుకు వచ్చి తమ ఆస్తులను మెట్రో మార్గం కోసం ఇచ్చారని ఆయన తెలిపారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం పలు భవనాలు, కట్టడాలను కూల్చివేసి, భవన వ్యర్థాలను తొలగించడం జరిగిందని చెప్పారు. సున్నితమైన కట్టడాలకు ఎటువంటి ముప్పు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా విస్తరణ పనుల వేగం కొంత తగ్గినప్పటికీ, ఇప్పుడు అవి మళ్ళీ పుంజుకుని సజావుగా సాగుతున్నాయని మెట్రో ఎండీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరిత గతిన పాతనగరం విస్తరణ పనులు పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వ అనుమతి రాగానే మెట్రో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.





పాలకొండ మండలం వాటపాగు గ్రామంలో 15వ ఫైనాన్స్ కింద ఎంపీపీ నిధులతో లక్ష రూపాయల అంచనాతో మంచి నీటి బోర్ మరియు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 35 వేల రూపాయల విలువతో పశువుల నీటి తొట్టె యొక్క ప్రారంభోత్సవంలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ గండి రామి నాయుడు, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, వాటపాగు సర్పంచ్ వావిలపల్లి రాజారావు, పాలకొండ మండల నాయకులు జాడ శ్రీధర్, పాలకొండ నియోజకవర్గ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. - సమయం న్యూస్, పాలకొండ





# రాజ్యాంగాన్ని పరిరక్షిస్తేనే దేశానికి రక్షణ

* **అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి..**
* **డిసిసి ప్రధాన కార్యదర్శి, తిమ్మాపూర్ మండల ఆర్డినేటర్ సిరాజ్ హుస్సేన్**

కరీంనగర్ ఏప్రిల్ 13 సమయం న్యూస్ : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటేనే అది దేశాన్ని కాపాడుతుందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి తిమ్మాపూర్ మండల కోఆర్డినేటర్ సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులా పూర్ కొత్తపల్లి, రేణిగుంట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సిరాజు హుస్సేన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మహాత్మా గాంధీ రాజ్యాంగం చిత్రపటాలతో వాడ వాడన ఇంటింటా పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు చేపట్టిన జై బాపూ, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలందరికీ వివరించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఆయాచోట్ల సిరాజు హుస్సేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు కుట్రలు పన్నుతున్నదని, ఈ కుట్రలను ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం పటిష్టమంతంగా ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని, దేశాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోకుంటే దేశం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి విభజించు పాలించు అనే సిద్ధాంతంతో ప్రజలను వంచిస్తూ పాలన సాగిస్తున్నదని మండి పడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక మహత్తరమైన పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతికి కేంద్ర బిందువుగా మారిన ధరణి స్థానంలో సోమవారం భూభారతి పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మ కంగా ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగొని లక్ష్మీనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి చింతల లక్ష్మారెడ్డి, బుధారపు శ్రీనివాసు, దన్నమనేని సురేందర్రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బొంగాని రాజు, రెడ్డి గాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి



**నర్సాపూర్ ఏప్రిల్ 13, (సమయం న్యూస్) :** నర్సాపూర్ పట్టణ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది లీగల్ ఫైర్ మెన్ ఐలయ్య, ఫైర్ మెన్ జానా రెడ్డి ,వెంకటేశం,ఆపరేటర్ అనిల్, నాయకులు సత్యం గౌడ్, బాల్ రెడ్డి,ప్రసాద్,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ...



## డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు

* **68వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**

**గుమ్మడిదల, ఏప్రిల్ 13 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారా నగర్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 68వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల, దోమడుగు గ్రామస్తులు నిరసన దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.తాము చేస్తున్న శాంతియుత నిరసనలకు ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డు పనులను శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటం ఈ ప్రాంత భవిష్యత్తు తరాల రక్షణ కోసమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, జగ్గారెడ్డి ,మద్ది మోహన్ రెడ్డి, పుట్ట ఎల్లయ్య, పెంటారెడ్డి, రాము, నరసింహారెడ్డి, మద్దుల బాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, స్వేచ్ఛ రెడ్డి, బిక్షపతి రెడ్డి సూర్యనారాయణ, జయపాల్ రెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయులు, సంజీవరెడ్డి, రంగనాథచార్యులు, యాదగిరి ,నరసింహులు అయూబ్, తుడుం రవి, శ్రీనివాస్, వినోద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనతోపాటు బాధ్యతలు నెరవేర్చాలి

* **మానవ మేధస్సుకు పదును పెట్టాలి**
* **విద్యార్థులకు చదువే ఆయుధం**
* **సెమినార్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**





**కరీంనగర్, ఏప్రిల్ 13, సమయం న్యూస్ :** హక్కుల సాధనతో పాటు దేశ పౌరులుగా బాధ్యతను కూడా నెరవేర్చాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో సమగ్రాభివృద్ధికి సంక్షేమ పథకాలు అనే అంశం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. అందుకు చదువు అననే ఆయుధాన్ని స్వీకరించాలని తెలిపారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయులంతా ఉన్నత విద్య అభ్యసించిన వారేనని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి హక్కులు గుర్తుంటాయని, ఆ హక్కుల సాధనకు పోరాడు తారని తెలిపారు. అదేవిధంగా దేశ పౌరుడుగా ప్రతి ఒక్కరూ తన బాధ్యతను కూడా నెరవేర్చాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబాపూలే ఉన్నత చదువులు అభ్యసించి దేశ అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. దేశంలో నాటుకు పోయిన తరతరాల మూఢాచారాలను తొలగించారని అన్నారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకుం టూనే మానవమేధస్సుకు పదును పెట్టాలని సూచించారు. సమాజ సేవలో నేటి యువత తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు. నిత్యం పుస్తక పఠనం చేస్తూనే, వివిధ రంగాలలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మహనీయుల చరిత్రను తప్పక తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మార్గాలను భవిష్యత్తు తరాలు అనుసరిస్తాయని విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతిని ఒక ఉద్యమంలా చేస్తున్నామని, ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గత చరిత్ర తెలుస్తుందని అన్నారు. మహనీయులు అందించిన ఫలాలను సద్వినియోగం చేసుకొని విద్యా ఉపాధి రంగాల్లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. గంగాధర ఎంపీడీవో దామురి రాము మాట్లాడుతూ దేశంలోని అసమానతలను,రుగ్మతలను రూపుమాపేందుకు, భావి భారత నిర్మాణానికి ప్రణాళికలు రచించిన సమతా మూర్తులని ఎప్పటికీ మరువరాదని అన్నారు. మహిళ సాధికారతే దేశ అభివృద్ధిగా చెప్పిన మహనీయుల బాటలో నడవాలని సూచించారు. ఎస్ ఆర్ ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రగతి మార్గానికి దోహదపడే పథకాలు చాలా ఉన్నాయని వాటిని అమలు చేయడమే మహనీయులకు మనమిచ్చే గౌరవమని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సెమినార్ కు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సెమినార్ లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ఓ.ఎస్.డి డా. హరికాంత్, కన్వీనర్ డా.మనోహర్, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, మైనారిటీ సెల్ సంచాలకులు డా.ఉమేరా తస్లీమ్, బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ సరసిజా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సూరేపల్లి సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. జయంతి, పరీక్షల నియంత్రణ అధికారి అబ్రరూల్ బకి, ఆచార్య వరప్రసాద్, డా. రంగప్రసాద్, డా. శ్రీవాణి, డా. మునావర్, అధ్యాపకులు డా. జోసఫ్ డా. తిరుపతి, డా. విజయకుమార్, డా. రవికుమార్, డా. రాజు, డా. యశ్వంతరావు, డా. ప్రసాద్, హరికృష్ణ, నరసింహ చారి పాల్గొన్నారు.



## దాచక్ పల్లి, నడిగడ్డ తాండ, దయ్యాలమర్రి తాండల్లో ఎన్ఎస్ఎస్ వేసవికాల శిబిరం ముగింపు సమావేశం

మహబూబ్ నగర్ ఏప్రిల్ 13( సమయం న్యూస్) : స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో లోని ఎన్ఎస్ఎస్ ఏడు రోజుల వేసవి కాల శిబిరంలో భాగంగా ఆదివారం నాడు ముగింపు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు ఉదయం డ్రగ్స్ అబూస్ మీద ర్యాలీని నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్ మేడం గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .మేడం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఏడు రోజు వేసవికాలం శిబిరం విజయవంతంగా ముగించినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ ప్రోగ్రాం లోని ఏడు రోజుల కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన కార్యక్రమాలను మేడం గారికి వివరించడం జరిగింది .ఈ సమావేశంలో అమీనా మేడం గ్రామంలోని పంచాయతీ సెక్రెటరీ మేడం నర్మద గారికి, స్పెషల్ ఆఫీసర్ సురేష్ గారికి, పాఠశాల హెడ్ మాస్టర్ అంజయ్య గారికి ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహించడానికి వసతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి పర్మిషన్ ఇచ్చిన ప్రతిరోజు పర్యవేక్షణ చేసిన మా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ .డాక్టర్. వి. రాజేంద్రప్రసాద్ గారికి కృతజ్ఞతలు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటరీలకు అమీనామేడం గారు సర్టిఫికెట్స్, ఆట పోటీలలో గెలిచిన వారికి, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమీన ముంతాజ్ జహాన్ ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్. ఐ.శ్రీవాణి, డాక్టర్ ఈ .శ్రీని వాసులు , ఎన్. మార్కండేయ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొనడం జరిగింది.

## గౌడ కులస్తులకు వీడీసీ తరఫున జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండించిన బోధన్ గౌడ కుల సంఘ నాయకులు



బోధన్ పట్టణం, 13 ఏప్రిల్, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులను గ్రామ విడిసి కమిటీ బహిష్కరణ చేయడాన్ని విడిసి ల దౌర్జన్యాన్ని బోధన్ డివిజన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మీడియా ముఖంగా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ తాళ్ళ రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులను విడిసి లకు పన్ను కట్టాలని వేధించగా, పన్ను కట్టలేని పరిస్థితిలో ఉన్నామనడంతో విడిసి గ్రామ పెద్దలు శ్రీరామ నవమి రోజున గౌడ మహిళలను గుడిలోకి రాకుండా వెలివేయడం చాలా బాధాకర విషయమని, దానితో గౌడ సంఘం కార్మికులు పోలీస్ వారికి కలసి వారి బాధలు చెప్పుకోవడంతో విడిసి లపైన కేసులు పెట్టడంతో కక్ష పెంచుకున్న విడిసి గ్రామ పెద్దలు నిన్నటి రోజున గౌడ్ ల సొంత స్థలాలలో పెంచుకున్న దాదాపు రెండు వందల ఈత చెట్లను నిప్పు పెట్టీ కాల పెట్టడంతో గౌడ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వీడీసీలకు చట్టబద్ధత లేకున్నా ఇలాంటి దౌర్జన్యాలు చేపట్టడాన్ని ఖండిస్తున్నామని ప్రభుత్వ అధికారులు విడిసి లపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి దౌర్జన్యాలను అరికట్టాలని కోరారు. గౌడ కులస్తులు రోజు కల్లు తీసి అమ్ముకుంటేనే కానీ కడుపు నిండని పరిస్థితి, విడిసి లపై జిల్లా కలెక్టర్, జిల్లా కమిషనర్, ప్రభుత్వ అధికారులు, నాయకులు వెంటనే చర్యలు తీసుకోవాలని తక్షణమే తాళ్ళ రాంపూర్ గ్రామ గౌడ కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా గౌడ కులస్తులు ఏకమై తాళ్ల రాంపూర్ గ్రామ గౌడ కులస్తులకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. త్వరలో రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి ఇట్టి విషయమై చర్చించి తదుపరి కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రంలో వివిద గౌడ సంఘాల నాయకులు బుషిగంప అశోక్ గౌడ్, నాగుల రవిశంకర్ గౌడ్, పిల్లకుంట్ల గంగాధర్ గౌడ్, గున్నల గంగాధర్ గౌడ్, విఠల్ గౌడ్, సాయ గౌడ్, రాజేందర్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం



## అవమాన భారం తో వ్యక్తి మృతి



గుమ్మడిదల ఏప్రిల్ 13 (సమయం న్యూస్): భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపం చెంది భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల గ్రామంలో శనివారం రాత్రి జరిగింది ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి గుమ్మడిదల గ్రామానికి చెందిన నాగరాజు ( 30) శనివారం రాత్రి గుమ్మడిదల గ్రామంలో గోపాల్ రెడ్డి వ్యవసాయ భూమి దగ్గర వేప చెట్టు కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 15 నెలల క్రితం కొండాపూర్ మండలంలోని రొయ్యపల్లి గ్రామానికి చెందిన అనిత తొ వివాహం జరిగింది. వీరి సంసారం కొన్ని రోజులు సజావుగా సాగింది, గత నెల రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో మృతుడి భార్య వాళ్ల పుట్టింటికి వెళ్లి పోయింది, మూడు రోజుల క్రితం ఇరు వర్గాల పెద్దలు మాట్లాడి సయోధ్య కుదిర్చిన , మళ్లీ అనిత వాళ్ల పుట్టింటికి వెళ్లింది.ఈ క్రమంలో ఈ నెల 12న ఇంటి నుండి బయటకు వెళ్లి ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు.మృతుని తల్లి సాలమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సహాయక చర్యలు వేగవంతం..

* కొనసాగుతున్న బండరాళ్ల తొలగింపు,
* ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి,

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 13 ( సమయం న్యూస్): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ఎస్ ఎల్ బి సి, సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో, ప్రమాద స్థలం సమీపంలోని పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ సహాయంతో విచ్చినం చేసి, లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు SLBC టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలో గల ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ...... ఎస్ ఎల్ బి సి, సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలలో దినదినంగా పురోగతి సాధిస్తున్నట్లు, తెలియజేశారు.



సహాయక చర్యల్లో భాగంగా కన్వేయర్ బెల్ట్ మరమ్మతులు, వెంటిలేషన్ పొడిగింపు, మట్టి తవ్వకాలు, టిబిఎం భాగాలను కత్తిరించే పనులు,స్టీలు ను బయటకు తరలించే పనులు, ఊట నీటిని బయటకు పంపింగ్ చేసే పనులు వేగంగా జరుగుతున్నాయని ,సహాయక బృందాలు నిర్విరామంగా టన్నెల్ లోపల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు



. ఎస్ ఎల్ బి సి, సొరంగంలో సహాయక బృందాలు తమ సహాయక చర్యల ద్వారా మట్టి తవ్వకాలకు ఏర్పడే ఆటంకాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, సహాయక చర్యలు నిరాటంకంగా కొనసాగేలా ప్రతి చిన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రమాద ప్రదేశానికి చేరుకునే మార్గాన్ని త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా, సహాయక చర్యల వేగం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. టన్నెల్ లోపల సహాయక చర్యలు అత్యంత సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా సాగుతున్నట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా కు చెందిన శాస్త్రవేత్తలు, నీటిపారుదల శాఖ నిపుణులు, టన్నెల్ నిర్మాణాల్లో అనుభవం కలిగిన ఇంజినీర్లు, మరియు ఇతర సంబంధిత శాఖల నిపుణుల సూచనలు, సలహాలను అనుసరిస్తున్నామన్నారు. ప్రతి చిన్న అంశాన్ని కూడా సాంకేతికంగా విశ్లేషిస్తూ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల వాతావరణం, మట్టినిల్వ, నీటి ప్రవాహం తదితర అంశాలపై నిత్యం పరిశీలనలు చేయబడుతున్నాయని, దాని ఆధారంగా తదుపరి చర్యలు వేగవంతంగా తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, జేపి కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ సంజయ్ కుమార్ సింగ్,హైడ్రాధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బోధన్ మున్సిపల్ పరిధిలో మంచినీటి సరఫరాలో అంతరాయం

బోధన్ పట్టణం, 13 ఏప్రిల్, సమయం న్యూస్ : బోధన్ పట్టణ మున్సిపల్ పరిధిలోని రాకాసిపేట్, శక్కర్ నగర్ లోని హౌసింగ్ బోర్డ్, ఆజంగంజ్ లోని వాటర్ ట్యాంకుల పరిధిలోని కాలనీలకు సోమవారము రోజున మంచినీటి సరఫరా లో అంతరాయం ఉంటుందని మున్సిపల్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్బర్ నగర్ వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడం వలన మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని అప్పటివరకు నీరు అందించలేమని కావున ప్రజలు దీనిని గమనించి సహకరించగలరని మున్సిపల్ అధికారులు తెలిపారు.



## సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

మెదక్ ఏప్రిల్ 13 (సమయం న్యూస్) : సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఆదివారం హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంబంధిత వైద్యాధి కారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్న తీరును కలెక్టర్ ఆరా తీశారు.ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలని, రోగుల సంఖ్య పెరగాలని అన్నారు. పేషెంట్లతో మాట్లాడి ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు...? అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మందులు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, లేబర్ రూమ్ లో సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పేషెంట్లకు మెరుగైన, నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని కలెక్టర్ సూచించారు. తనిఖీలో కలెక్టర్ వెంట, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.






## బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**: ఎమ్మెల్యే కాలేరు**

అంబర్ పేట, ఏప్రిల్ 13, సమయం న్యూస్: బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో గొల్నాక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భూపతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శివం రోడ్డు లోని ధ్రువ హోటల్ లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అంబర్ పేట ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ గారి పిలుపుమేరకు 27న జరగబోయే భారీ బహిరంగ సభకు ప్రజలు అత్యధిక మెజారిటీతో పాల్గొనాలని కోరారు. సీనియర్ నాయకులు,మహిళా ప్రతి నిధులు, డివిజన్ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







## పాలకొండ నియోజక వర్గంలో పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జయకృష్ణ

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సమీక్ష

* హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ శాఖ అధికారులు
* ప్రాజెక్టుల వారీగా పనుల వివరాలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్ ఏప్రిల్ 13 (సమయం న్యూస్) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు జలసౌధలో



జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల తాజా పరిస్థితి, పనుల నిర్వహణ, అనుమతులు, ఆర్థిక అవసరాలపై ప్రధానంగా చర్చించారు.. ప్రస్తుత స్థితి, చేసిన ఖర్చు, నిధుల అవసరాలు, ప్రాజెక్టుల ప్రాధాన్యతల గురించి ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, లక్ష్మీకాంత రావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికురాలికి ఆర్థిక సహాయం

గుమ్మడిదల, ఏప్రిల్ 13 : (సమయం న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీలో సఫాయి కార్మికురాలు పనిచేస్తున్న రాజమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్నారు. విషయాన్ని తెలు సుకున్న గుమ్మడిదల గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు కాలకంటి బాల్ రెడ్డి, శ్రీనివాస్ తది తరులు పాల్గొన్నారు.



# ప్రజల అవసరాల పైనే ప్రభుత్వం ఫోకస్

* **రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖమంత్రి డి శ్రీధర్ బాబు.**

కాటారం ఏప్రిల్ 13( సమయం న్యూస్): ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం కాటారం మండల పరిధిలోని ధన్వాడ సబ్ స్టేషన్ లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన అదనపు 33/11కెవి ఉప విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కాటారంలోని శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాటారం గ్రామ పంచాయతి కార్యాలయంలో 50 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతి భవనం, కాటారం మండలానికి సంబంధించిన కోటి రూపాయలతో నిర్మించనున్న స్పోర్ట్స్ స్టేడియం కాంప్లెక్స్ నిర్మాణం (వాలీబాల్ కోర్టు, బాస్కెట్ బాల్ కోచ్, బ్యాడ్మింటన్ కోర్టు,ఓపెన్ జిమ్, క్రికెట్ నెట్) శంకుస్థాపన, 14 లక్షలతో కాటారంలో చిల్డ్రన్స్ పార్క్, 2 కోట్లతో పిడబ్ల్యు రోడ్డు దామరకుంట నుండి మానేరు వరకు బీటీ రోడ్ వరకు, 3 కోట్లతో ఒడిపిలవంచ నుండి గూడూరు జెడ్పీ రోడ్డు వరకు బీటీ రోడ్డు, 3 కోట్ల,95 లక్షలతో పిడబ్ల్యు రోడ్డు నుండి ధన్వాడ బూడిద పల్లి వరకు బీటీ రోడ్డు, 2 కోట్లతో గుండ్రాతిపల్లి నుండి ఊట్లపల్లి పోచమ్మ దేవాలయం వరకు బీటీ రోడ్డు, కోటి 90 లక్షల రూపాయలతో కాటారం మండలంలోని గ్రామాలలో అంతర్గత సిసి రోడ్డు మరియు సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు మరియు 2005 మహిళా సంఘాలకు 3,12,64,235 రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి శంకుస్థాపనలు, పంపిణీ చేశారు. అంతకుముందు . కాటారం, మహాముత్తారం, మలహర్ రావు, మహాదేవ్ పూర్ మండలాలకు వైకుంఠ రధాలకు అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి ప్రారంభోత్సవం చేసి నాలుగు మండలాలకు అందచేశారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ సిఎస్ ఆర్ నిదులు 20 లక్షలతో అందించిన అంబులెన్స్ పలిమెల మండలానికి మంత్రి మీదుగా ప్రారంభోత్సవం చేసి అందచేశారు. మాజీ సభాపతి శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని బిఎల్ఎం గార్డెన్స్ లో మంత్రి కంటి అద్దాలను పేషెంట్లకు అందచేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు కాటారం, మహాదేవపూర్, మహ ముత్తారం, మలహర్ రావు, పలిమెల మండల కు సంబంధించి 243 మంది లబ్ధిదారులకు కోటి 90 లక్షల విలువ వేసి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ధన్వాడ పాఠశాలలో 100 డేస్క్ బెంచ్ లను కాటారం మండలానికి సంబంధించిన 8 పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రజలు చాలా సార్లు తన దృష్టికి తెచ్చారని అవన్నీ నేడు నెరవేర్చే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టినట్లు తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని ఆ క్రమంలో అన్ని హంగులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం ద్వారా 50 వేల నుండి 4 లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నామని దరఖాస్తు చేసుకోవాలని పథకం వివరాలను వివరించారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నదని, మిగిలిన వాటా బ్యాంకు లేదా లబ్ధిదారులు చెల్లించాలని సూచించారు. పధకాన్ని నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సూచించారు. మీరు మరో 10 మందికి ఉపాధి కల్పించాలని తెలిపారు. మే 15 నుండి 26వ తేది వరకు జరుగనున్న సరస్వతి పుష్కర పనులను 35 కోట్ల తో చేపట్టినట్లు తెలిపారు. టెంట్ సిటి ఏర్పాటు ద్వారా భక్తులకు సౌకర్యాలు కల్పన పనులు చేపట్టినట్లు తెలిపారు. తన తండ్రి శ్రీపాదరావు రావు ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ఈ క్రమంలో మరింత.ఎం ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిపిఓ నారాయణరావు, డిఆర్డిఓ నరేష్ పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, ఎంపీడీవో బాబు, తహసిల్దార్ నాగరాజు, ఎంపిఓ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.






## ఏపీలో ఎనిమిది మంది IAS అధికారుల బదిలీ




అమరావతి: ఏపీలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ బదిలీలకు సంబంధించి సీఎస్ విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆర్పీ సిసోదియా.. చేనేత, జౌళి పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శిగా బదిలీ అయ్యారు. అలాగే, సీసీఎల్ఏ, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న జయలక్ష్మికి రెవెన్యూశాఖ అద నపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ కార్యదర్శి భాస్కర్ కాటమనేనికి ఏపీ హెచ్ఆర్డీఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధి శిక్షణ సంస్థ కమిషనర్‌గా ముత్యాలరాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రైతు బజార్ల సీఈవోగా కె.మాధవీలత; ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమి; ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్; వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రజల హక్కులు కాపాడేందుకు రాజకీయాల్లోకి వస్తున్నా

**: ఏబీ వెంకటేశ్వరరావు**



అమలాపురం: కాళ్లు, చేతులు ఆడినంత వరకు సమాజం కోసం పని చేస్తానని ఉద్యోగ విరమణ చేసిన సందర్భంలో చెప్పానని, ఆ మాటకు కట్టుబడి రాజకీయా ల్లోకి వస్తున్నానని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మెరుగైన భవిష్యత్ కోసం ప్రయ త్నిస్తానన్నారు. ఈ సందర్భంగా వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వైకాపా విధ్వంసం సృష్టించిందని, రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బ తీసిం దని అన్నారు. వైకాపా నేతలకు సంఘంలో గౌరవం లేదన్నారు. ''ఏపీకి పొంచి ఉన్న అతిపెద్ద ప్రమాదం జగన్‌మోహన్‌రెడ్డి. రాజకీయాలు అంటే సంపాదన అని ఆయన అనుకుంటారు. గత ఐదేళ్లలో జగన్ చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఆయన వల్ల ఐదేళ్ల విలువైన సమయం కోల్పోయాము. అక్రమాలు చేసేవారికే ఆయన పెద్దపీట వేస్తారు. ప్రజలను కులాలు, వర్గాలుగా విడదీస్తారు. జగన్ కోసం బలైన మొదటి వ్యక్తి కోడికత్తి శ్రీను. అతడి జీవితాన్ని జగన్ చిదిమేశారు. ఐదు సంవత్సరాలు జైల్లో పెట్టించారు. సాక్ష్యం చెప్పకుండా కేసును జగన్ నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ అభిమానులు పునరాలోచించుకోవాలి. కోడికత్తి శ్రీనుకు నా వంతు సహకారం అందిస్తా. జగన్ బాధితులకు అండగా ఉంటాను. జగన్ అక్రమాలు, అన్యాయాలు బయట పెడతాను. నేను పోరాడతాను. నా ప్రయత్నానికి అం దరూ సహకరించాలి. జగన్‌పై కేసులు కోకొల్లలు.. వాటిపై పోరాడతాను'' అని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు.

## 'తిరుపతి తొక్కిసలాట' ఘటనలో భూమన కరుణాకర్‌రెడ్డి హస్తం ఉండొచ్చు: బీఆర్ నాయుడు



తిరుపతి: తిరుమల తిరుపతి దేవ స్థానం(తితిదే) ఛైర్మన్‌గా భూమన కరు ణాకర్‌రెడ్డి ఉన్న సమయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ప్రస్తుత తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు ఆరోపించారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో భారీ అక్ర మాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఆదివారం తిరుపతి ఎస్వీ గోశాలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భూమన అతిపెద్ద అవినీతిపరుడని, తితిదేలో ఆయన కమీషన్ల ఛైర్మన్‌గా వ్యవహరించారని మండిపడ్డారు. ''తితి దేని రాజకీయాల్లోకి లాగొద్దు. దేవుడితో పెట్టుకుంటే ఆయన చూస్తూ ఊరుకోడు. అనారోగ్యం, వృద్ధాప్యంతో గోవులు మర ణించాయే తప్ప తితిదే సిబ్బంది నిర్లక్ష్యం లేదు. భూమన విడుదల చేసినవన్నీ మార్ఫింగ్ ఫొటోలే. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి వాటిని భూమనకు ఇచ్చారు. భూమనపై క్రిమినల్ కేసులు పెడతాం. వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాటలో భూమన హస్తం ఉండొచ్చు. తొక్కిసలాట సమయంలో హరినాథరెడ్డి అక్కడే ఉన్నారు. ఆయన కూడా ఆ ఘటనకు కారణం కావొచ్చు''అని బీఆర్ నాయుడు అన్నారు. గోశాలపై దుష్ప్రచారం చేసిన భూమనపై ఎన్డీయే కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై కేసు నమోదు చేయాలని కోరుతూ తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుకి వినతి పత్రం అందజేశారు.

## అనకాపల్లి విషాదం..
## మృతుల కుటుంబాలకు రూ.15లక్షల పరిహారం



అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ఎనిమిది మంది మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. కొటవురట్ల మండలం కైలా సపట్నంలో జరిగిన ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. అగ్నిప్రమాదంలో మరణించిన ఒక్కొక్కరికీ రూ.15లక్షలు చొప్పున ఆయా కుటుంబాలకు పరిహారంగా అందించనున్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. అగ్నిప్రమాదం ఘటన గురించి తెలుసుకున్న హోంమంత్రి అనిత హుటాహుటిన అక్కడికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. అనకాపల్లి అగ్నిప్ర మాదంపై స్థానికులు, అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారన్నారు. ప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించి నట్లు తెలిపారు. అగ్నిప్రమాదంపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ ఆరా తీశా రన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని చెప్పారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇచ్చేదని.. సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో ఇచ్చిన ఆదేశాలతో రూ.15 లక్షల పరిహారం ప్రకటిస్తున్నట్లు అనిత వెల్లడించారు.

## షేక్ హసీనాపై మరోసారి అరెస్టు వారెంటు..!

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాపై అక్కడి న్యాయస్థానం మరోసారి అరెస్టు వారెంట్ జారీ చేసింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకున్నారంటూ హసీనాతో పాటు ఆమె సోదరి రెహనా, మరికొందరిపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆదివారం అరెస్టు వారెంట్ జారీ అయింది. హసీనాతో పాటు ఆమె సోదరి, బ్రిటీష్ ఎంపీ తులిప్ రిజ్వానా సిద్ధిక్, మరో 50 మంది అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ అవినీతి నిరోధక కమిషన్ (ACC) ఆరోపిస్తూ బంగ్లాదేశ్ కోర్టులో పిటిషన్ ఛార్జిషీట్లు చేసింది. వీటిని పరిశీలించిన న్యాయస్థానం.. అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 27కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. అక్రమంగా నివాస స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ షేక్ హసీనా, ఆమె కుమార్తె సైమా వాజెద్ పుతుల్, మరో 17 మందిపై బంగ్లాదేశ్ కోర్టు ఇటీవల అరెస్టు వారెంటును జారీ చేసింది. రాజధాని శివారులోని పుర్బాచల్ ప్రాంతంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న భూమి లీజుకు సంబంధించిన అభియోగంపైనా ఏసీసీ తన దర్యాప్తు నివేదికను కోర్టుకు సమర్పించింది. మాజీ ప్రధానమంత్రి, ఆమె కుటుంబ సభ్యులకు ఢాకాలో గృహ సౌకర్యాలు ఉన్నా.. నివాస స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ఏసీసీ ఆరోపించింది. అయితే.. నిందితులు పరారీలో ఉన్నందున ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి జాకీర్ హొస్సేన్ గాలిబ్ అరెస్టు వారెంట్ జారీ చేశారు.

## వీఐపీ బ్రేక్ దర్శన ఎన్‌రోల్‌మెంట్ స్లిప్‌పైనే గదుల కేటాయింపు

తిరుమల : శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కోసం సిఫారసు లేఖలతో వచ్చే భక్తులకు దర్శన ఎన్‌రోల్‌మెంట్ స్లిప్‌పైనే గదులు కేటాయించే విధానాన్ని శనివారం తితిదే అదనపు ఈఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఇప్పటి వరకు భక్తులు తమకు సిఫారసు చేసిన వారి అసలు ధ్రువపత్రాలతోపాటు ఒక జిరాక్స్ ప్రతి తీసుకురావాల్సి ఉండేది. ఆ జిరాక్స్ ప్రతిపై అదనపు ఈఓ కార్యాలయ సిబ్బంది గదుల కేటాయింపునకు స్టాంపింగ్ చేసేవారు. ఇందు కోసం క్యూలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చేది. భక్తులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఈ ప్రక్రియను సులభతరం చేశారు. భక్తుడు దర్శన ఎన్‌రోల్‌మెంట్ స్లిప్‌తో గదుల కేటా యింపు కేంద్రాల వద్దకు వెళ్లి స్కానింగ్ చేస్తే చాలు.. నేరుగా గదులు పొందొచ్చు.

సమయం
epaper.samayamdaily.net
APTEL/2006/18267



## అదరగొట్టిన ఆర్సీబీ ఓపెనర్లు..
# రాజస్థాన్‌పై విజయం..






జయపుర: ఐపీఎల్ (IPL) 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌పై బెంగళూరు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు సాల్ట్ 65 (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), కోహ్లీ 62* (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదరగొట్టడంతో 174 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు 17.3 ఓవర్లలోనే ఛేదించింది. లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన బెంగళూరు మొదటి ఓవర్ నుంచే రాజస్థాన్‌పై ఎదురు దాడికి దిగింది. ఒకవైపు సాల్ట్, మరోవైపు కోహ్లీ ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ పరుగుల వరద పారించారు. వీళ్లిద్దరి దూకుడు చూస్తే, మొత్తం టార్గెట్‌ను వీళ్లే పూర్తి చేసేలా కనిపించారు. ఈ క్రమంలో కార్తికేయ వేసిన బంతిని ఎదుర్కొన్న ఫిలిఫ్ సాల్ట్.. యశస్వికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ 40* (28 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్) కలిసి కోహ్లీ మ్యాచ్ ముగించాడు. రాజస్థాన్ బౌలర్లలో కార్తికేయకు ఒక వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఫిలిప్ సాల్ట్ ఎంపికయ్యాడు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జైస్వాల్ 75 (47 బంతుల్లో, 10 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధశతకంతో రాణించాడు. చివర్లో ధ్రువ్ జురెల్ (35*) అదరగొట్టాడు. కెప్టెన్ సంజు(15) నిరాశపర్చాడు. రియాన్ పరాగ్ 30 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. హిట్‌మెయర్ 9, నితీశ్ రాణా 4* పరుగులు చేశారు. బెంగళూరు బౌలర్లలో యశ్, హెజిల్‌వుడ్, కృనాల్, భువీ ఒక్కో వికెట్ తీశారు.



# MOVIE TIME



## ఏడాదిలో 15 బ్రాండ్స్ వదులుకున్న సమంత.. కారణమేమిటంటే..?



హైదరాబాద్: సెల్ఫ్ లవ్, ఆరోగ్యం, ప్రశాంతతకు గత కొంతకాలంగా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు నటి సమంత. నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తూ తన అభిరుచులకు అనుగుణంగా ఆమె జీవిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం, వాణిజ్య ప్రకటనలు వంటి అంశాలపై ఆమె చర్చించారు. ఇందులో భాగంగా ఇటీవల తాను ఎన్నో బ్రాండ్స్ వదులుకున్నట్లు చెప్పారు. రూ. కోట్లు వస్తున్నప్పటికీ వాటిని పక్కన పెట్టడానికి ఒక బలమైన కారణం ఉందన్నారు. '20 ఏళ్ల వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అప్పట్లో సక్సెస్‌కు నిర్వచనం చాలా విభిన్నంగా ఉండేది. మనం ఎన్ని ప్రాజెక్ట్‌లు చేశాం, ఎన్ని బ్రాండ్స్‌కు ప్రకటనకర్తగా ఉన్నామనే దానిపైనే విజయాన్ని నిర్ణయించేవారు. ఆ సమయంలో ఎన్నో మల్టీనేషనల్ బ్రాండ్స్‌కు నేను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ, ఇప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉత్పత్తులను ప్రమోట్ చేసేటప్పుడు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు ఇష్టం వచ్చిన బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా ఉన్నందుకు నాకు నేనే క్షమాపణ చెబుతున్నా. నాకు తెలిసిన ముగ్గురు వైద్యులతో పరిశీలించి.. అవి సమాజానికి ఎలాంటి హాని చేయవని నిర్ణయించుకున్నాకే వాటిని చేస్తున్నా'' అని సమంత వివరించారు.

## రాజ్‌తరుణ్‌కు స్టార్ ట్యాగ్ కోరిన నిర్మాత: అదేంటంటే?

హైదరాబాద్: నటుడు రాజ్‌తరుణ్‌కు స్టార్ ట్యాగ్ ఇవ్వాలని నిర్మాత ఎస్.కె.ఎన్ విజ్ఞప్తి చేశారు. 'పాంచ్‌మినార్' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆ చిత్ర నిర్మాతలను కోరారు. ఈ సినిమా టైటిల్ రోల్స్‌లో రాజ్‌తరుణ్ పేరుకు ముందు 'స్పాంటేనియస్ స్టార్' అని పెట్టాలని, తదుపరి చిత్రాల నిర్మాతలూ దాన్ని కొనసాగించాలని మనసులో మాట బయటపెట్టారు. అతడి కామెడీ టైమింగ్ బాగుంటుందని అందుకే ఆ ట్యాగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై రాజ్‌తరుణ్ స్పందిస్తూ.. 'మీరు ఏది చెబితే అదే ఫాలో అవుతా' అని నిర్మాతతో అన్నారు. రాజ్‌తరుణ్ హీరోగా దర్శకుడు రామ్ తెరకెక్కించిన చిత్రం 'పాంచ్ మినార్'. రాశీసింగ్ హీరోయిన్. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న సందర్భంగా టీజర్ విడుదల చేశారు.





”

త్రిష కృష్ణన్ మరోసారి ఆన్ మరియు ఆఫ్ స్క్రీన్ రెండింటిలోనూ హృదయాలను గెలుచుకుంది. నటి ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో స్మార్ట్ గ్రే కలర్ సెట్ ధరించి స్టైలిష్ మిర్రర్ సెల్ఫీని షేర్ చేసింది

## ఆ హీరోతో డేటింగ్?



'అఆ' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కర్లీ హెయిర్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఈ అమ్మడు కెరీర్ ఆరంభంలో పద్ధతైన పాత్రలు మాత్రమే చేస్తూ తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంది. టాప్ స్టార్ హీరోలతో మూవీస్ చేయలేకపోయినా.. యూత్‌లో ఈ ముద్దుగుమ్మకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. మధ్యలో చాన్స్‌లు రాక కొంత గ్యాప్ తీసుకున్నప్పటికీ.. ఎవ్వరూ ఊహించని విధంగా 'టిల్లు స్క్వేర్' లాంటి కమర్షియల్ చిత్రాల్లో గ్లామర్ పాత్రలో మెప్పించింది. తర్వాత అదే జోరును 'డ్రాగన్'తోనూ కంటిన్యూ చేసింది. ప్రస్తుతం ఆమె సినిమాల్లో 'పరదా' మీద చాలా ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకుంది. అయితే తాజాగా అనుపమ ప్రేమలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. స్పాటిఫైలో వీరిద్దరి పేరిట 'బ్లూ మూన్' అనే ప్లే లిస్ట్ కనిపించడం, వారు ముద్దు పెట్టుకున్నట్లుగా ప్రొఫైల్ పిక్చర్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. మరోవైపు ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'బిసన్' అనే సినిమా చేస్తున్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈచిత్రంలో ధ్రువ్ కబడ్డీ ప్లేయర్‌గా కనిపించనున్నారు. ఇందులో అనుపమ ఆయన ప్రియురాలి పాత్రలో నటిస్తోంది. దాని ప్రమోషన్ కోసమే ఇలా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## ఆకాంక్ష స్టన్నింగ్

**టాకీస్:** సుమంత్ నటించిన 'మళ్లీ రావా' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ ఆకాంక్ష సింగ్. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రాణించనప్పటికీ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అయితే ఇందులో ఆకాంక్ష నటనకి మంచి మార్క్స్‌పడ్డాయి. హిందీలో టీవీ సీరియల్ నటిగా కెరీర్ ప్రారంభించిన ఆకాంక్ష సింగ్ నటిగా మంచి గుర్తింపు పొందింది. దేవదాస్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన ఈబ్యూటీ పరంపర, మీట్‌క్యూట్‌లోనూ సందడి చేసింది. కన్నడ, హిందీ , తమిళ చిత్రాల్లోనూ నటించిన ఈ యంగ్ బ్యూటీ ఫ్యాన్స్‌ని మెప్పించింది. చాలా రోజుల తర్వాత.. ఆమె నటించిన 'షష్టిపూర్తి' సినిమా త్వరలోనే థియేటర్లలో విడుదల కాబోతున్నది. కాగా.. చేతిలో సినిమాలు ఉన్నా లేకున్నా కూడా అందాల ఆరబోతలో మాత్రం తగ్గట్లేదు ఈ ముద్దుగుమ్మ. ఎప్పటికప్పుడు తన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్‌చేస్తూ ప్రేక్షకులతో టచ్‌లోనే ఉంటోంది. లేటెస్ట్‌గా రెడ్ అండ్‌వైట్ డ్రెస్సులో ఇన్‌స్టాలో ఆమె షేర్‌చేసిన పిక్స్‌నెట్టింట వైరల్‌గా మారాయి. ఆకాంక్ష స్టన్నింగ్‌లుక్, బ్యూటిఫుల్ అంటూ ఫ్యాన్స్ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.



”

శ్రీలీల ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త ఫోటోలను షేర్ చేసింది, అది అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నటి రాబోయే చిత్రం మాస్ జతారాలోని అందమైన సాంప్రదాయ పసుపు రంగు దుస్తులు ధరించి కనిపిస్తుంది. ఈ స్టిల్ తు మేరా లవర్ అనే సినిమా మొదటి పాట నుండి వచ్చింది. శ్రీలీల తన నృత్య భంగిమలో అందంగా మరియు నమ్మకంగా కనిపిస్తుంది, ఇది ఇప్పటికే అభిమానులను ఆకట్టుకుంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.